నీరు నిలవకుండా చర్యలు

- పొలాల్లో నీటిని బయటకు తోడాలి
- ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న రైతులు
- తర్వాత యూరియా, అమ్మోనియా ఎరువులు వాడాలి

కంచికచర్ల: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు సాగుచేసిన పంట పొలాల్లో నీరు నిలిచింది. వాన నీరు నిలవకుండా రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే వేరు కుళ్లు తెగుళ్లు వచ్చి ఆశించిన మేరకు పంట దిగుబడి రాదు. పంట భూముల్లో నిల్వ ఉన్న నీటిని పారలతో చిన్నపాటి కాల్వలను తవ్వి వాటి ద్వారా నీటిని బయటకు పంపించాలి. ఆ తర్వాత మొక్కల ఎదుగుదలకు వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు మందులు, ఎరువులను ఉపయోగించాలి. మండలంలోని రైతులు తమ పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపే చర్యలు చేస్తున్నారు. అవసరమైన ఎరువులు వాడుతున్నారు.


గండేపల్లిలో మొక్కజొన్న పంటలో నిలిచిన వాన నీరు

తెగుళ్ల నివారణకు చర్యలు

పంట చేలల్లో ఎక్కువగా వర్షం నీరు నిల్వ ఉండటంతో పంటలకు తెగుళ్లు ఆశిస్తాయి. నీటిని బయటకు తోడిన తర్వాత తెగుళ్ల నివారణకు వరి పంటకు బూస్టర్ డోస్ కింద ఎకరానికి 25 కేజీల యూరియా, మ్యూరేట్ పొటాష్ 15కేజీలు వేయాల్సి ఉంటుందని వ్యవసాయశాస్త్ర వేత్తలు తెలిపారు. ప్రత్తి, పెసర వంటి పంటలకు 2శాతం యూరియా, ఒకశాతం పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాల్సి ఉంటుంది. కాపర్ ఆక్సీక్లోరైడ్ 600గ్రాముల పత్తి, పెసర మొదట్లో తడిచేలా పిచికారీ చేయాలి. వరి పంటకు తెగుళ్లు ఆశించకుండా ఎకరానికి కార్బండిజమ్ 200గ్రాములు హెక్సకొనజోల్ 400 మిల్లీగ్రాములను పిచికారీ చేయాలి.


కంచికచర్లలో పత్తి చేనులో వర్షం నీరు నిలబడితే బయటకు పంపిస్తున్న రైతు


కంచికచర్లలో మొక్కజొన్న చేనులో రసాయన ఎరువులు చల్లుతున్న రైతు


పేరకలపాడులో పెసర పొలంలో వాన నీరు

క్లుప్తంగా

మఠం శివాలయం రెండో దశ పనులు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పాలేటి తీరాన ఉన్న పంచాయతన క్షేత్రం మఠం శివాలయం పునర్నిర్మాణ రెండో దశ కాంక్రీట్ పనులను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదివారం ప్రారంభించారు. అర్చకుడు ఘట్టి సాయిశర్మ, ట్రస్టు కమిటీ సభ్యులు.. ఎమ్మెల్యే తాతయ్యకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తాతయ్య పంచాయతన క్షేత్రంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి కాంక్రీట్ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు కమిటీ సభ్యులు నీలిశెట్టి వాసు, డోగుపర్తి రామారావు, కొంకిమళ్ల మల్లు, సంక భాస్కరరావు, వేముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన కల్వర్టు



కంచికచర్ల: నాగార్జున సాగర్ కెనాల్‌పై మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గండేపల్లి పేరకలపాడు గ్రామాల మధ్యన ఎస్ఎస్పీ కెనాల్ ఉంది. దీనిపై 30 ఏళ్ల క్రితం చిన్నపాటి బ్రిడ్జి నిర్మించారు. ప్రస్తుతం అది కూలడానికి సిద్ధంగా ఉంది. దానికి ఉన్న ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. కల్వర్టుకు రెండు వైపులా ఏర్పాటు చేసిన దిమ్మెలు పూర్తిగా విరిగిపోయాయి. నిత్యం పొలాలకు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. పంట ఉత్పత్తులు ఇళ్లకు చేరవేసేందుకుగానీ వ్యవసాయ పనులు చేసేందుకు రైతులు, రైతు కూలీలు వెళ్తుంటారు. శిథిలావస్థదశకు చేరిన కల్వర్టు ఎప్పుడు కూలిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కల్వర్టుపై నీరు నిలిచిపోతోంది. దాన్ని తొలగించి ఎస్ఎస్పీ కెనాల్‌పై కొత్తగా మరో కల్వర్టు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు



విజయవాడ కల్చరల్: తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన గాయని ఎస్‌కే చిత్ర అని మురగా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు ఒమ్మి సంతోష్‌నాయుడు అన్నారు. సూర్యారావుపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం చిత్ర జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మికి చిత్ర సామాజిక సేవా పురస్కారం ప్రదానం చేశారు. సంతోష్ నాయుడు మాట్లాడుతూ.. చిత్ర తెలుగు పాటలకు ఆరుసార్లు జాతీయ అవార్డులను అందుకున్నారన్నారు. విజయలక్ష్మి మాట్లాడుతూ.. చిత్ర సినీ రంగ సేవలను గుర్తించి పద్మశ్రీ, పద్మభూషణ్ అందించారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పి.వెంకన్న, పి.శ్రీనివాస్, శ్యాంప్రసాద్, చలపతి రావు, గాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగా శిక్షణ శిబిరం ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): శాంతివన్ యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగ శిక్షణ సదస్సు కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ప్రారంభమైంది. ఎన్టీటీపీఎస్ ఏడీఈ ఎ.శ్రీనివాసరావు యోగా శిబిరం ప్రారంభించారు. యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాపై మక్కువ పెంచుకుని సాధన చేయాలని సూచించారు. యోగా గురువు లంకే జనార్ధన మాట్లాడుతూ యోగా, ధ్యానం చేయడం ద్వారా దురాలోచన కలగకుండా సానుకూల దృక్పథం అలవడుతుందన్నారు. యోగా గురువు సాధకులతో వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, ధ్యానం, చేయించారు. కార్యక్రమంలో ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, స్థానికులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ సీయోను మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా అమెరికా దేశానికి చెందిన సిస్టర్ అలెక్స్ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య అలవర్చుకోవాలన్నారు. విద్యతోనే మానవ మేధస్సు వృద్ధి చెందుతుందని తెలిపారు. విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ మోగులూరి సురేష్, పాస్టర్లు మోగులూరి సుశేశ్వరరావు, బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

వీరులపాడు: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే ప్రమాద సమయాల్లో తీవ్రత అధికంగా ఉంటుందని ఎస్ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. వీరులపాడులో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ చేశారు. ముందుగా అధిక లోడుతో వస్తున్న ఆటోలను ఆపి డ్రైవర్లు, ప్రయాణికులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలన్నారు. ముఖ్యంగా ఆటోల్లో పరిమితి మేరకు మాత్రమే ప్రయాణికులను ఎక్కించాలని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పరిమితికి మించి ప్రయాణికులతో వస్తున్న ఆటోలను గుర్తించి జరిమానా విధించారు. తనిఖీల్లో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

నందిగామ టౌన్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ దుర్గామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ అమాయక ప్రజలను ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు రూటుమార్చి వ్యవహరిస్తున్నారని పోలీసులం మాట్లాడుతున్నాం మీ వాళ్లు ఫలానా కేసులో ఇరుక్కున్నారు మీరు డబ్బు పంపితే వారిపై కేసు లేకుండా చేస్తామంటూ వినూత్న రీతిలో మోసాలకు తెరతీశారని గుర్తు చేశారు. అనుమానిత ఫోన్ కాల్స్ వస్తే వెంటనే 1930కుగానీ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గోతులు పూడ్చారు



గండేపలి(కంచికచర్ల): గండేపల్లి నుంచి కీసర వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఆ రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. నందిగామ, కంచికచర్ల వెళ్లాలంటే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అంతేకాకుండా గండేపల్లి గ్రామ సమీపంలో సెంటిని కర్మాగారం ఉండటంతో నిత్యం పదుల సంఖ్యలో ఇదే రోడ్డుపై పెద్దపెద్ద లారీలు వస్తుంటాయి. ఇదే రోడ్డుపై ప్రయాణించాలంటే ఆటోవాలల సైతం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన కొంతమంది యువకులు సెంటినీ బయోప్రొడక్ట్స్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి రోడ్డును బాగుచేయాలని కోరారు. స్పందించిన కంపెనీ ప్రతినిధులు సొంత నిధులతో రోడ్డును బాగు చేయించారు. దీనిపై స్థానికులు స్పందించారు.

ఘనంగా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవ కార్యక్రమాన్ని గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వ్యాగన్ వర్క్‌షాప్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ మేనేజర్ రామచంద్ర మీనా, మానవ మందిరం ఆశ్రమ మహాత్మ అనుభూతి బావాజీ మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు మొక్కలు ఆధారమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు.

వెయ్యి మందికి ఉచిత వైద్య పరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో ఆదివారం మానవ సేవా సంస్థ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సుమారు 1000 మందికి పైగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోగా, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ముఖ్య అతిథిగా పాల్గొని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ మానవ సేవా సంస్థ జగ్గయ్యపేటలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్‌ను అభినందించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఏపీ, తెలంగాణలో వందలకు పైగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటుచేశామని, కంటి, గుండె ఆపరేషన్లు కూడా చేస్తున్నామన్నారు. వైద్యశిబిరంలో డాక్టర్లు వేణుగోపాలరెడ్డి, నిఖిల్, శశిధర్, మాధురి, రవికుమార్, అర్చన, రాజశేఖర్, వంశీ పాల్గొన్నారు.


పేటలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

నందిగామ టౌన్: శంకర కంటి ఆస్పత్రి, భగవాన్ సత్యసాయి సేవా సమితి, సత్యసాయి భజన మండలి, జిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ముప్పాళ్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నందిగామ ఎమ్మెల్యే సౌమ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ట్యాంకర్ తీసుకెళ్లారు

- అల్లూరులో టీడీపీ నేతల లెక్కలేనితనం
- సర్పంచ్‌పై దుర్భాష

వీరులపాడు: మండలంలోని అల్లూరు గ్రామంలో టీడీపీ నేతలు లెక్కలేకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అనుమతి లేకుండా ట్యాంకర్ తీసుకెళ్లి సర్పంచిని దుర్భాషలాడారు. వివరాల్లోకి వెళ్తే గత పార్లమెంటు సభ్యుడు అన్ని గ్రామాల పంచాయతీలకు తన నిధుల నుంచి వాటర్ ట్యాంకులను అందజేశారు. ట్యాంకర్‌ను సర్పంచి, పంచాయతీ కార్యదర్శి అనుమతితో గ్రామస్తులు వినియోగించుకుంటున్నారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇంట్లో శుభకార్యం నిమిత్తం ట్యాంకర్‌ను తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న అధికార పార్టీ నేతలు సర్పంచి బందెలరాణి, పంచాయతీ కార్యదర్శి అనుమతి లేకుండా గ్రామంలోని టీడీపీ కార్యాలయం వద్దకు ఆ ట్యాంకర్‌ను తీసుకెళ్లారు. దీనిపై సమాచారం అందుకున్న సర్పంచ్ బందెలరాణి, ఉప సర్పంచి బెల్లంకొండ నాగేశ్వరావు అక్కడికి వెళ్లి అధికార పార్టీ నాయకులను అడిగారు. నీకు ఈ ట్యాంకర్‌తో సంబంధం లేదని మేం సమాధానం చెప్పాల్సిన అవసరం లేదంటూ దూషించారని సర్పంచ్ కన్నీటి పర్యంతమయ్యారు. సర్పంచ్‌పై అధికార పార్టీ నాయకులు లెక్కలేనితనంతో వ్యవహరించడంతో ఆ గ్రామంలోని దళిత వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనకు జరిగిన అవమానాన్ని ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ బందెల రాణి తెలిపారు.


అల్లూరులోని టీడీపీ కార్యాలయం వద్ద వాటర్ ట్యాంకర్

మధురంగా సాగిన యువ రాగం

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో నెల వారీ యువరాగం కార్యక్రమంలో భాగంగా లబ్బీపేటలోని మహతి వేదికపై ఆదివారం యువ సంగీత కళాకారిణి పవిత్ర నిర్వహించిన గాత్ర కచేరీ మధురంగా సాగింది. వాగ్గేయకారులు రచించిన సంకీర్తనలు శ్రీ మహాగణపతిం, వందనము రఘునందన, సీతమ్మ మాయమ్మ, సరోజదళనేత్రి, అందము ఆనంద ఆనందము, నారాయణతే నమోనమో, శ్రీ రామజయరామ, అప్పదరకు కీర్తనలను మధురంగా గానం చేశారు. బీవీఎస్ శ్రీ కృష్ణ వయోలిన్‌పై, మృదంగంపై జగన్మోహిని సహకరించారు. శ్రీ సద్గురు సంగీత సభ కార్యదర్శి గౌరీనాథ్ మాట్లాడుతూ.. యువ సంగీత కళాకారులను ప్రోత్సహించడానికి ప్రతి నెలా సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నవంబర్‌లో నగరంలో పెద్ద ఎత్తున సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధాన సంగీతోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. సంస్థ అధ్యక్షుడు ప్రకాష్, సంగీత విద్వాంసురాలు గాయత్రి గౌరీనాథ్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణభగవానుడు అని త్రైత సిద్ధాంత ప్రతినిధులు ప్రచారం నిర్వహించారు. ఆదివారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక విజయవాడ కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిగింది. ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండటంతో గురు పౌర్ణమిగా నిర్ణయించి సాక్షాత్తు శ్రీకృష్ణుడుని మాత్రమే జగద్గురువుగా భావించి, గురు పూజ చేయాలని ప్రతినిధులు తెలియజేశారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు సురేష్, సీతప్పడు, శంకర్, జయ, యశస్వి పాల్గొన్నారు.



భక్తజన కోలాహలం

ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తజన కోలాహలం నెలకొంది. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సారె సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆరో అంతస్తులో సారె సమర్పించి, అమ్మవారిని దర్శించుకున్నారు. కనకదుర్గానగర్, పుష్కర ఘాట్, కొండపై భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు ఇబ్బంది కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











భ్రమరాంబ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసం పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారికి పాత శివాలయం పాలకమండలి సభ్యులు ఆషాఢ సారె సమర్పించారు. విద్యాధరపురం రావి చెట్టు సెంటర్‌లోని ఆలయ పాలకమండలి చైర్మన్ బొమ్ము మధు ఇంటి వద్ద ఆదివారం దేవస్థానం వేద పండితులు పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ సారె తీసుకుని పెద్ద సంఖ్యలో భక్తులు వెంటరాగా ఇంద్రకీలాద్రి దిగువన ఉన్న కామధేను అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు సమరించారు. అక్కడి నుంచి సమీపంలోని శ్రీవిజయేశ్వరస్వామి, వినాయకుని దేవస్థానాల్లో స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. తర్వాత పాత శివాలయానికి చేరుకుని దేవస్థానం ప్రధాన అర్చకులు నాగరాజు శర్మ, రఘు, అర్చకులు సాయి, గణేష్ ప్రత్యేక పూజలు నిర్వహించగా పాలకమండలి సభ్యులు భ్రమరాంబ అమ్మవారు, మల్లేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు, ఇష్టకామేశ్వరి అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పాత శివాలయం పాలకమండలి చైర్మన్ బొమ్ము మధు, సభ్యులు రాంపిళ్ల వాసు, నాగోతి గురు రాంప్రసాద్, చంద్రశేఖర్, నాగోతి విజయనిర్మల, సౌజన్య, శాంతి, ఏనుగుల దుర్గాభవానీ, కామినేని కమల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


రావిచెట్టు సెంటర్ నుంచి సారెతో బయలుదేరిన పాలకమండలి సభ్యులు

సారె సమర్పించిన భక్త బృందాలివే

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం పలు భక్త బృందాలు సారెను సమర్పించాయి. జగ్గయ్యపేటకు చెందిన సమరసత సేవా సంఘానికి చెందిన 200 మంది, శ్రీకాకుళానికి చెందిన దశరథ గురు భవానీ ఆధ్వర్యంలో 105 మంది, ఏపీ బ్రాహ్మణ సంఘం సమాఖ్యకు చెందిన 150 మంది, కృష్ణలంకకు చెందిన శ్రీదుర్గా సేవా సమితికి చెందిన 108 మంది, కంకిపాడుకు చెందిన శ్రీసీతారామ కోలాట బృందానికి చెందిన 60 మందితో పాటు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు.

సారె సమర్పించిన ఐఆర్ఎస్ కోటేశ్వరమ్మ

దుర్గగుడి పూర్వపు ఈవో, ఐఆర్ఎస్ కోటేశ్వరమ్మ ఆదివారం అమ్మవారికి సారెను సమర్పించారు. అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసిన కోటేశ్వరమ్మను ఆలయ ఈవో కెఎస్. రామరావు సాదరంగా స్వాగతం పలికారు.